సాక్షి వరంగల్

శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



'క్రాస్ కంట్రీ' జట్ల ఎంపిక

బెంగళూరులో నిర్వహించనున్న క్రాస్ కంట్రీ పోటీలకు కేయూ పురుషులు, మహిళల జట్టును ఎంపిక చేశారు. - 8లో▸



సర్వీస్ రూల్స్ అమలు

సహకార ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ అమలు చేయనున్నట్లు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు తెలిపారు. - 8లో▸



వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మేఘాలతోపాటు సూర్యరశ్మితో వేడిగా ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు 'మెపా' జాబ్‌మేళా



నర్సంపేట: ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) ఆధ్వర్యంలో శనివారం వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న ఐఎంఏ హాలులో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ తెలిపారు. స్థానిక మెపా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్, డిగ్రీ, ఆపై అర్హత ఉండి 30 ఏళ్లలోపు ఉన్న వారు ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెపా స్టేట్ ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ నర్సింహుల రాకేష్ మాట్లాడుతూ మేళాలో వివిధ సంస్థలు పాల్గొని 500లకు పైగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. వివరాల కోసం 97010 11801 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. గోనెల భిక్షపతి, కీసరి సాంబరాజు, నాగరాజు, నగేష్, రవిచంద్ర, ప్రవీణ్, చేరాలు, శ్రీను, దేవేందర్, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

ఇద్దరికి మెమోలు

నర్సంపేట రూరల్: పట్టణంలోని వల్లభ్‌నగర్ శివారు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో వాతావరణ మార్పులతో 34 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం పాఠకులకు విదితమే. అయితే విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన పాఠశాల వైద్యుడు సత్యం, (ఏడీఐ) ఆర్మీ డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్ ప్రేమ్‌చంద్రశేఖర్‌లకు టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ సెక్రటరీ రోనార్డ్ రాస్ మెమోలను ఆన్‌లైన్‌లో జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారికి అందించారు.

అనాథ పిల్లల నమోదు షురూ..

వరంగల్ రూరల్: జిల్లాలోని అన్ని మండలాల్లో అనాథ పిల్లల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. వరంగల్, ఖిలా వరంగల్ మండలాలకు చెందిన అనాథ పిల్లల నమోదు ప్రక్రియ కలెక్టరేట్‌లోని ధరణి సమాచార కేంద్రం పక్కన జిల్లా బాలల రక్షణాధికారి(ఇన్‌చార్జ్) దొమ్మటి రాజు పర్యవేక్షణలో శుక్రవారం కొనసాగింది. మండలాలవారీగా మీసేవ కేంద్రాల్లో నమోదు ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ విద్య, ఉద్యోగావకాశాల్లో అనాథ పిల్లలకు మూడు శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. నమోదు ప్రక్రియ ముగిసిన నెల రోజుల్లో తహసీల్దార్లు అనాథ పిల్లలకు గుర్తింపు కార్డులు జారీ చేస్తారని చెప్పారు. నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, 156 దరఖాస్తులు నమోదయ్యాయని ఆయన పేర్కొన్నారు. కాగా.. వరంగల్ సుందరయ్య నగర్‌కు చెందిన బోసు సునీత, లక్ష్మణ్ దంపతులు భారీ వర్షాల సమయంలో కూలీకి వెళ్లి మృతిచెందగా.. వారి ముగ్గురు పిల్లలు సంజు, నందు, రిషి అనాథలుగా మిగిలారు. వారి పేర్లను పెదనాన్న మల్లేశం అనాథ పిల్లలుగా ఈరోజు నమోదు చేయించారు.

ఆ టీచర్లు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు..

కాళోజీ సెంటర్: 317 జీఓ ద్వారా బదిలీ అయిన ఉపాధ్యాయులు ఈనెల 12 నుంచి 14 వరకు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో బదిలీ దరఖాస్తు చేసుకున్న ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హార్డ్ కాపీలకు సర్వీస్ రిజిస్టర్, సంబంధిత సర్టిఫికెట్లు జతచేసి ఎన్‌టైటిల్మెంట్ పాయింట్స్ కోసం హెచ్‌ఎంలకు ఇవ్వాలని సూచించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఎంఈఓలకు ఇవ్వాలని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు బదిలీ దరఖాస్తులను డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ రూరల్: జిల్లాకు చెందిన దళిత నిరుద్యోగ అభ్యర్థులు గ్రూప్–2, 3, 4 పోటీ పరీక్షలకు ప్రభుత్వం అందించే ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్(ఇన్‌చార్జ్) షేక్ జహీరుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం వంద సీట్లకు 65 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 13 వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు 93463 74583 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

నేడు సమావేశం

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర అభివృద్ధిపై శనివారం హైదరాబాద్‌లో కీలక సమావేశం జరగనుంది. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్, ఉన్నతాధికారులు హాజరయ్యే సమావేశానికి మేయర్ గుండు సుధారాణి, 'కుడా' చైర్మన్ సుందర్ రాజ్, కమిషనర్ ప్రావీణ్య, హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు.

ఇటు యాత్ర.. అటు భరోసా..!

- జిల్లా వేదికగా ప్రతిపక్షాల ప్రచార హోరు
- హాథ్ సే హాథ్ జోడో యాత్రతో కాంగ్రెస్
- స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లతో రంగంలోకి బీజేపీ
- రాజకీయ కాక పెంచుతున్న పార్టీలు



సాక్షి, వరంగల్: జిల్లాలో ప్రతిపక్ష పార్టీ నేతల జోడో యాత్రలు, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లతో రాజకీయం వేడెక్కుతోంది. జిల్లాను వేదికగా చేసుకున్న పార్టీలు కదనరంగంలోకి దిగాయి. ఓ వైపు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు హాథ్ సే హాత్ జోడో యాత్రలు చేస్తుండగా.. మరోవైపు బీజేపీ నేతలు 'ప్రజా గోస–బీజేపీ భరోసా' పేరిట స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లతో ఎన్నికల వాతావరణాన్ని తలపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులన్నీ చూస్తుంటే అప్పుడే ఎన్నికలొచ్చాయా.. అని ప్రజలు చర్చించుకునే స్థాయికొచ్చింది. ముఖ్యంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉమ్మడి వరంగల్ వేదికగా చేస్తున్న యాత్ర పొలిటికల్ హీట్ పెరిగేలా చేసింది.

పాదయాత్రలతో కాంగ్రెస్ జోరు..

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కొండా సురేఖ, వర్ధన్నపేట నియోజకవర్గంలో నమిండ్ల శ్రీనివాస్, నర్సంపేట నియోజకవర్గంలో దొంతి మాధవరెడ్డి పాదయాత్రలు చేస్తూ జనాల్లో మమేకమవుతున్నారు. పార్టీ కార్యకర్తలు, శ్రేణుల్లో జోష్ నింపుతున్నారు. ఇంకోవైపు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రతో హస్తం పార్టీలో రెట్టించిన ఉత్సాహం పెరిగింది. మళ్లీ ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ వస్తామో.. రామో.. తెలియదు కానీ.. ఇదే ఎన్నికల ప్రచారం అనుకోండంటూ ఆయా నేతలు చెబుతున్నారు.

కమలంలోనూ జోష్..

వరంగల్ తూర్పు నియోజకవర్గం పోచమ్మ మైదాన్‌లో శుక్రవారం ప్రారంభమైన 'ప్రజా గోస–బీజేపీ భరోసా' పేరిట స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో రాష్ట్ర కార్యదర్శి మురళీధర్‌గౌడ్, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, వన్నాల శ్రీరాములు, జిల్లా కన్వీనర్ కల్లోల త్రిలోకేశ్వర్ పాల్గొన్నారు. వర్ధన్నపేట నియోజకవర్గం భీమారంలో జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాజీ ఎమ్మెల్యేలు మొలుగూరి భిక్షపతి, కొండేటి శ్రీధర్, నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండలం పాకాల సరస్సుపై కట్టమైసమ్మ వద్ద జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కొండేటి శ్రీధర్ పాల్గొన్నారు. ఈనెల 25 వరకు నియోజకవర్గంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో ఈ మీటింగ్‌లతో ప్రజలకు మరింత చేరువయ్యేలా కమలనాథులు దూసుకెళ్తున్నారు.

వైఫల్యాలను ఎండగట్టేందుకే..

- పల్లె గోస–బీజేపీ భరోసా యాత్ర..
- మాజీ ఎమ్మెల్యే టి.రాజేశ్వర్‌రావు

నల్లబెల్లి/ఖానాపురం: కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే 'పల్లె గోస–బీజేపీ భరోసా యాత్ర' చేపట్టామని బీజేపీ రాష్ట్ర నాయకుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే టి.రాజేశ్వర్‌రావు అన్నారు. 'పల్లె గోస–బీజేపీ భరోసా యాత్ర'లో భాగంగా నల్లబెల్లి మండలం మేడపల్లి, రాంపూర్, గొల్లపల్లి, ఆసరవెల్లి, కొండాపూర్, మూడుచెక్కలపల్లిలో స్ట్రీట్ మీటింగ్‌లు నిర్వహించగా.. ఖానాపురం మండలం పాకాలలో కట్టమైసమ్మ వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం దబ్బీరుపేటలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా పేరు మార్చుకున్న సీఎం కేసీఆర్, మంత్రులు బీఆర్‌ఎస్‌ను పలకలేక టీఆర్‌ఎస్‌ను మర్చిపోలేకపోతున్నారని అన్నారు. బీఆర్‌ఎస్‌తో ప్రజలకు ఎలాంటి లాభం లేదని, డబ్బులు పెట్టి సమావేశాలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్‌లో కోలుకునే పరిస్థితి లేదని, ప్రతిపక్షంగా కూడా పార్టీ విఫలమైందన్నారు. బీఆర్‌ఎస్‌కు బీజేపీని ప్రత్యామ్నాయ శక్తిగా ఆదరించాలన్నారు. సమావేశాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, రేసు శ్రీనివాస్, నర్సింగరావు, రేవూరి నర్సింహారెడ్డి, బొట్ల పవన్, వల్లె రమేశ్, వేముల రాజు, వడ్డేపల్లి నర్సింహరాములు, సంతోశ్‌నాయక్, గటిక అజయ్‌కుమార్, సలీం, లింగబత్తుల యాకస్వామి, ఐలయ్య, పరిపాటి సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



నల్లబెల్లి : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వర్‌రావు. పక్కన రేవూరి ప్రకాశ్‌రెడ్డి

దుర్మార్గపు పాలనకు చరమగీతం పాడాలి

- తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను ఆదరించాలి
- మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

చెన్నారావుపేట: రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడాలని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపించాలని ఏఐసీసీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. గుంటూరుపల్లిలో శుక్రవారం ప్రారంభమైన హాథ్ సే హాథ్ జోడో యాత్ర భీమ్లా నాయక్‌తండా, లచ్చిరాంతండా మీదుగా అక్కల్‌చెడకు చేరింది. ఈ సందర్భంగా రైతులు, చిన్నారులు, కూలీలతో ఆయన ముచ్చటించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. గ్రామాల్లో జెండాలను ఆవిష్కరించారు. అనంతరం అక్కల్‌చెడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లి సోనియా గాంధీ రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు తెలంగాణ రాష్ట్రాన్ని బహుమతిగా ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా అధ్యక్షురాలు, గుంటూరుపల్లి సర్పంచ్ కర్నాటి పార్వతమ్మ, పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, నియోజకవర్గ కన్వీనర్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, నర్సంపేట మున్సిపల్ కౌన్సిలర్ వేముల సాంబయ్యగౌడ్, నర్సంపేట మండల అధ్యక్షుడు లక్ష్మణ్, భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య, నాయకులు సంపత్‌రెడ్డి, రమేశ్‌యాదవ్, అమీరొద్దీన్, బండారు మంజుల, మంచాల సదయ్య, సర్పంచ్‌లు సిద్దన రమేశ్, తప్పెట రమేశ్, తూటి పావని పాల్గొన్నారు.



హాథ్ సే హాథ్ యాత్రలో దొంతి మాధవరెడ్డి

హామీలు విస్మరించిన ప్రభుత్వం

వర్ధన్నపేట: ఇచ్చిన హామీలను విస్మరించి.. ప్రజలను మోసం చేసి చేతకాని ప్రభుత్వంగా బీఆర్‌ఎస్ మిగిలిందని వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ అన్నారు. హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర శుక్రవారం మూడో రోజుకు చేరింది. చెన్నారం, కాషగూడెం గ్రామాల్లో యాత్ర సందర్భంగా శ్రీనివాస్ ప్రతీ వ్యక్తిని పలకరిస్తూ ముందుకు సాగారు. ఇంటింటా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ కుటుంబ పాలనలో ఎమ్మెల్యేలు పెద్ద పెద్ద భవనాలు నిర్మించుకుని విలాసవంతమైన జీవితాలు గడుపుతూ పేదలను మరింత పేదలుగా దిగజార్చారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ మాత్రమే పాలన సరిగా చేసి.. పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా ఉందని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తంగెళ్లపెల్లి తిరుపతి, ఎద్దు సత్యనారాయణ, పోరెడ్డి మహేందర్‌రెడ్డి, జక్కి శ్రీకాంత్, పుట్ట తిరుపతి, కొమ్ము రమేశ్, గుంటి కుమారస్వామి, మేకల రవీందర్, కల్లెపు రాజు, బర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నారంలో జెండా ఆవిష్కరించి మాట్లాడుతున్న నమిండ్ల శ్రీనివాస్

పేదలను ఆదుకునేందుకే పథకాలు

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సంగెం: రాష్ట్రంలోని నిరుపేదలను ఆదుకునేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ వివిధ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని తన నివాసంలో సంగెం, గీసుకొండ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 86 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.86,09,976 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు పేదింటి ఆడబిడ్డల పెళ్లి చేయడానికి తల్లిదండ్రులు పడే కష్టాన్ని చూసిన కేసీఆర్ కల్యాణలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పార్టీలకతీతంగా ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు విశ్వనారాయణ, రాజేశ్వర్‌రావు, జెడ్పీటీసీ పోలీస్ ధర్మారావు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు పూలుగు సాగర్ రెడ్డి, మండల అధ్యక్షుడు గుండేటి బాబు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

అపరాల సాగుతో ప్రయోజనాలు

- జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్

వర్ధన్నపేట: అపరాల సాగుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, వరి సాగుకు ముందు ఈ పంట సాగు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉషాదయాళ్ అన్నారు. ప్రపంచ అపరాల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ల్యాబర్తి గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అపరాల సాగు రైతులకు, సాగు భూమికి వారధిగా పని చేస్తుందన్నారు. అపరాల సాగు కింద పెసర, మినుము, అలసంద తదితర పంటలను అంతర పంటగా లేదా ఒకే పంటగా సాగు చేయవచ్చన్నారు. ఒకే పంటగా సాగు చేసినప్పుడు పంట దిగుబడితోపాటు భూమిలో సేంద్రియ పదార్థం ఎక్కువగా భూమిలో ఏర్పడుతుందన్నారు. శాస్త్రవేత్త రాంప్రసాద్ మాట్లాడుతూ అంతర పంటలు లేదా కలగలిపి సాగు చేసినా ఒక పంట దెబ్బతిన్నా మరో పంట దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. డాక్టర్ రాములు మాట్లాడుతూ పెసర, పిల్లి పెసర తదితర పప్పు జాతి పంటలను సాగు చేయడం వల్ల భూమిలో పూత సమయంలో కలిపి దుక్కి చేసుకుంటే సేంద్రియ పద్ధతితోపాటు 0.5–1 శాతం నత్రజని భూమిలో ఏర్పడుతుందన్నారు. సర్పంచ్ పస్తం రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీటీసీ అన్నమనేని ఉమ, ఏడీఏ సురేష్‌కుమార్, ఏఓ రాంనర్సయ్య, ఎన్‌పీఎస్‌ఎం కో ఆర్డినేటర్ పి.సారంగం, రైతుబంధు కో ఆర్డినేటర్ కర్ర కొమురయ్య, ఏఈఓ కార్తీక్, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉషాదయాళ్

'కంటి వెలుగు' శిబిరం సందర్శన

సంగెం: రామచంద్రాపురంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రజలకు కంటి వెలుగు శిబిరంపై అవగాహన కల్పించి.. అందరు పరీక్షలు చేయించుకునేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. శిబిరానికి వచ్చే ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ అశోక్, డాక్టర్ అరవింద్ రాజ్, వైద్య సిబ్బంది సత్యరాజ్, ఉపేంద్ర, రంజిత్, కుమారస్వామి, వెంకటరమణ, ప్రసూన, సునీత, సుజాత, హనుప్రియ, మౌనిక తదితరులు పాల్గొన్నారు.



వృద్ధుడికి కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటరమణ

డిగ్రీ పరీక్షల్లో ముగ్గురు డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షల్లో శుక్రవారం కాపీయింగ్ చేస్తూ రెండు కేంద్రాల్లో ముగ్గురు విద్యార్థులు పట్టుబడినట్లు పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ జి.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. వీరిని డీబార్ చేసినట్లు వారు పేర్కొన్నారు.

పీజీ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు..

కేయూ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పీజీ కోర్సుల మూడవ సెమిస్టర్ పరీక్షలు 32 కేంద్రాల్లో శుక్రవారం ప్రారంభమయ్యాయి. వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 12 మంది విద్యార్థులు స్క్వాడ్లకు పట్టుబడి డీబార్ అయ్యారని అధికారులు తెలిపారు. యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని వీసీ తాటికొండ రమేష్ సందర్శించి పరీక్షల తీరుతెన్నులను పరిశీలించారు.

సీజనల్ తిప్పలు!

- వాతావరణ మార్పులు, చలి తీవ్రతతో జ్వరాలు
- 1–14 ఏళ్ల వయసు పిల్లలకు దగ్గు, వాంతులు
- నివారణకు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ సూచనలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పిల్లలు(ఫైల్)

నర్సంపేట రూరల్: వారం పది రోజులుగా వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో చిన్నారులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా 1–14 ఏళ్ల వయసు పిల్లలు జ్వరం, దగ్గు, జలుబు, వాంతులతో సతమతమవుతున్నారు. ఎంతకూ తగ్గకపోవడంతో వైద్యుల సూచన మేరకు తల్లిదండ్రులు పిల్లలను ఆస్పత్రుల్లో చేరుస్తున్నారు. ఎక్కువగా హాస్టళ్లలో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థులు వైరస్ బారినపడి త్వరితగతిన అస్వస్థతకు గురవుతున్నారు. ఇటీవల నర్సంపేట పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 34 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికాగా.. అందులో 10 మంది పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఆస్పత్రిలో చేర్పించిన విషయం విదితమే. వారికి మెరుగైన చికిత్స అందించి రెండు రోజుల్లో డిశ్చార్జి చేశారు.

నివారణ చర్యలు ఇలా..

- వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు రావడంతో చల్లదనంతో వైరస్ వృద్ధి చెంది జ్వరాలు, జలుబు, దగ్గు, వాంతులు ఎక్కువయ్యే పరిస్థితి ఉంది. ఈ వైరస్ పిల్లలకు ఎక్కువగా సోకి పరిస్థితి తీవ్రంగా కనిపిస్తుంది.
- ఇలాంటి పరిస్థితుల్లో చలి ప్రదేశంలో పిల్లలను ఎక్కువగా తిరగనివ్వకూడదు.
- రాత్రివేళల్లో హాస్టల్, ఇంట్లో గదుల్లోని కిటికీలను తెరవకూడదు. ఉదయం సూర్యుడు వచ్చిన తర్వాతే కిటికీలు తెరవాలి.
- తెల్లవారుజామున మంచు కురుస్తున్నప్పుడు చిన్నారులను బయటకు వెళ్లనీయకుండా చర్యలు తీసుకోవాలి.
- దగ్గు, జలుబు, జ్వరం ఉంటే వెంటనే ఆస్పత్రిలో చేర్చి సరైన సమయంలో చికిత్స అందించాలి. లేదంటే పరిస్థితి విషమంగా ఉండే పరిస్థితి ఉంది.
- ముఖ్యంగా హాస్టళ్లలో ఉండే విద్యార్థులు తగిన జాగ్రత్తలు పాటించాలి. దగ్గు, జలుబు ఉంటే తోటి విద్యార్థులను దూరంగా ఉంచి చికిత్స అందించాలి.
- చలి తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఈ వైరస్ ఒకరి నుంచి ఒకరికి త్వరగా సోకుతుంది.

పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి..



ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో గదులు వెచ్చగా ఉండేలా చూసుకోవాలి. చిన్న పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. వైరస్ వల్ల పెద్దగా ప్రమాదం ఉండదు. చిన్న పిల్లలు కోలుకోవడానికి కాస్త సమయం పడుతుంది. ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ గోపాల్, సీనియర్ పిల్లల వైద్యులు, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, నర్సంపేట

సీపీ చొరవతోనే నా స్థలం దక్కింది : అసద్

- రంగనాథ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం



ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న అసద్

కాశిబుగ్గ: వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ దయతోనే తన పూర్వీకుల నుంచి సంక్రమించిన స్థలం తనకు దక్కిందని కాశిబుగ్గకు చెందిన దివ్యాంగుడు సయ్యద్ అసద్ అన్నారు. శుక్రవారం కాశిబుగ్గ జంక్షన్‌లో సీపీ రంగనాథ్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అసద్ మాట్లాడుతూ కాశిబుగ్గ పోచమ్మగుడి ప్రాంతంలో తన పూర్వీకుల నుంచి దాదాపు 40 ఏళ్లుగా ఉంటున్న ఇంటిని, ఖాళీ స్థలాన్ని అదే ప్రాంతానికి చెందిన రామ యాదగిరి కబ్జా చేయాలనే ఉద్దేశంతో తప్పుడు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్(జీపీఏ) చేయించుకుని ఇబ్బందులకు గురి చేశాడని తెలిపారు. కోర్టుకెళ్లి తాను గెలిచినా సెటిల్‌మెంట్‌కు రావాలని బెదిరింపులకు పాల్పడడంతో కార్పొరేషన్, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. సీపీ వచ్చిన తర్వాత వెళ్లి ఫిర్యాదు చేయడంతో ఆయన ఆదేశాలతో ఇంతేజార్‌గంజ్ పోలీసులు పూర్తి విచారణ చేపట్టి వాస్తవమని తేలడంతో యాదగిరిపై కేసు పెట్టారని తెలిపారు.

క్రీడల ప్రాక్టీస్‌కు స్టేడియానికి రండి..

కాశిబుగ్గ: వరంగల్ నగరంలోని ఓ సిటీ స్టేడియంలో రోజూ జరిగే క్రీడల ప్రాక్టీస్‌కు ఆసక్తి గల ఔత్సాహిక క్రీడాకారులు, విద్యార్థులు రావాలని జిల్లా యువజన క్రీడల అధికారి ఎస్.ఇందిర శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రోజూ ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు ఓ సిటీ స్టేడియంలో కోచ్‌ల ఆధ్వర్యంలో క్రికెట్, హ్యాండ్‌బాల్, జూడో, వాలీబాల్, షటిల్, టేబుల్ టెన్నిస్, క్యారమ్, చెస్ తదితర క్రీడలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నగరంలోని ఆసక్తి గల క్రీడాకారులు, పాఠశాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

క్లుప్తంగా

'పింగిళి' డిగ్రీ ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ రమేశ్, ప్రిన్సిపాల్ చంద్రమౌళి

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) డిగ్రీ కోర్సుల బీఏ, బీకాం, బీఎస్సీ మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు శుక్రవారం ఆ కళాశాలలో కేయూ వీసీ తాటికొండ రమేశ్ విడుదల చేశారు. మొత్తం బీఏ, బీకాం, బీఎస్సీ మూడో సెమిస్టర్ పరీక్షలకు 440 మంది విద్యార్థులు హాజరవగా.. వారిలో 261 మంది (59.3 శాతం) ఉత్తీర్ణులైనట్లు ప్రిన్సిపాల్ చంద్రమౌళి తెలిపారు. ఈసందర్భంగా ఆకళాశాల పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రామకృష్ణారెడ్డి పరీక్షల ఫలితాల్ని క్యూ ఆర్ కోడ్ సాయంతో విడుదల చేశారు. ఎన్‌సీసీ పరేడ్‌ను వీసీ తిలకించి కేడెట్లను అభినందించారు. ఈకార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు రేణుక, శిరీష, డాక్టర్ పార్వతి, అధ్యాపకురాలు కల్పన వినయ్‌కుమార్, మహ్మద్ రఫీ, ఎన్‌సీసీ కేడెట్స్ సీనియర్ అండ్ ఆఫీసర్ అవంతి, దివ్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

- కరీంనగర్ జోన్ ఈడీ వి.వెంకటేశ్వర్లు
- బస్ వాషింగ్ ప్లాంట్ ప్రారంభం



బస్ వాషింగ్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కరీంనగర్ జోన్ ఈడీ వి.వెంకటేశ్వర్లు

హన్మకొండ: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం, సుఖవంతమని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ వి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం హనుమకొండలోని వరంగల్-1 డిపోలో నూతనంగా నిర్మించిన బస్ వాషింగ్ ప్లాంట్‌ను ఈడీ వి.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అనంతరం విధుల్లో ప్రతిభ కనబర్చిన ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈడీ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్యోగులకు నగదు అవార్డులందించి, శాలువా కప్పి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజా రవాణా సంస్థను మన మందరం కాపాడి భావితరాలకు టీఎస్ ఆర్టీసీ సేవలు కొనసాగేలా చూడాలన్నారు. ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు కృపాకర్‌రెడ్డి, మాధవరావు, వరంగల్ వన్ డిపో మేనేజర్ పి.శ్రీనివాసరావు, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మిన్నంటిన ఆర్తనాదాలు

- కూలీలు ప్రయాణిస్తున్న ఆటో బోల్తా
- 17 మందికి గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం



ప్రమాదానికి గురైన ఆటో, చెల్లాచెదురుగా పడి ఉన్న కూలీలు





తీవ్ర గాయాలపాలైన చిక్కుడు, సబక రమేశ్

వాజేడు: నడిరోడ్డుపై కూలీల ఆర్తనాదాలు మిన్నంటాయి. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని జగన్నాథపురం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో 17 మందికి గాయాలయ్యాయి. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ నిర్లక్ష్యంతోపాటు పరిమితికి మించి ప్రయాణించడం వల్ల ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. కూలీలు తెలిపిన వివరాల ప్రకారం.. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల పరిధిలోని దొడ్ల కొత్తూరు గ్రామానికి చెందిన 16మంది కూలీలు ఆటోలో వాజేడు మండల కేంద్రంలో మిర్చి కోతలకు వస్తున్నారు. జగన్నాథపురం గ్రామ సమీపంలోకి రాగానే.. జాతీయ రహదారిపై నుంచి ఆటో ఒక్కసారిగా రోడ్డు దిగిపోయి గుంతలో తిరుగ పడింది. దీంతో ఆటోలో ఉన్న 16 మంది కూలీలతోపాటు డ్రైవర్‌కు గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న సమీపంలోని జగన్నాథపురం గ్రామస్తులు, ఆటో కార్మికులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను తమ ఆటోల్లో ఎక్కించుకుని వాజేడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అందరికి ప్రాథమిక చికిత్స నిర్వహించారు.

కాగా.. ఈ ప్రమాదంలో దొడ్డి చిక్కుడు, కోగిల కుమారి, మాధురి వెన్నెల, సొగల రవి, సబక సీత, సబక రఘు, సొగల రామి, సబక్ దూల, శ్యామల శంభు, చగలం మోతి, మార శ్రీను, సోయం భీమయ్య, పూనెం శ్రీను, సబక రమేశ్, సోయం వొంగి, సబక మంగ, వావిలాల శ్రీను ఉన్నారు. కాగా.. సబక రమేష్ తలకు, చవలం మోతి వెన్నుపూసకు గాయం కాగా, పూనెం శ్రీను తలకు, వావిలాల శ్రీను కుడి చేతికి బలమైన గాయాలయ్యాయి. దొడ్డి చిక్కుడు అనే వృద్ధురాలి కుడి మోచేయి వద్ద కండ లేచి పోయింది. తీవ్రగాయాలైన చవలం మోతి, సబక రమేశ్, వావిలాల శ్రీనులను 108 అంబులెన్స్‌లో ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రికి తరలించారు. ఆటోడ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో ప్రమాదం జరిగిందని క్షతగాత్రులు తెలిపారు. పియాగో ఆటోలో సాధారణంగా ఏడుగురు కూర్చుకోవచ్చు. కానీ డ్రైవర్‌తో కలిపి 17మంది ప్రయాణించారు. ఓవర్‌లోడ్ కూడా ప్రమాదానికి కారణమని పోలీసులు తెలిపారు. ఘటనపై సోయం భీమయ్య ఫిర్యాదు మేరకు వాజేడు ఎస్సై కొప్పుల తిరుపతి రావు కేసు నమోదు చేశారు.

కడియం సోదరుడి కన్నుమూత



కడియం కృష్ణయ్య (ఫైల్)



సోదరుడి పార్థివదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న కడియం శ్రీహరి

హన్మకొండ: మాజీ ఉప ముఖ్య మంత్రి కడియం శ్రీహరి సోదరుడు కృష్ణయ్య (75) అనారోగ్యంతో కన్నుమూశారు. కొద్ది రోజులుగా హనుమకొండలోని ఓమెగా హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న కృష్ణయ్య గురువారం రాత్రి 9.30 గంటలకు మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన గతంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో చీఫ్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్‌గా సేవలందించి పదవీ విరమణ పొందారు. ఆయన పార్థివదేహాన్ని హనుమకొండ విద్యానగర్‌లోని స్వగృహంలో బంధు, మిత్రులు, అభిమానుల సందర్శనార్థం ఉంచి శుక్రవారం కాజీపేటలోని క్రైస్తవ శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. సోదరుడి మరణ వార్త తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి వారి స్వగృహానికి చేరుకుని పార్థివదేహాన్ని సందర్శించారు. పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు.

సహకార ఉద్యోగుల సర్వీస్ రూల్స్ అమలు

- డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు



మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు

హన్మకొండ : రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 44 మేరకు వరంగల్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధి అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లోని ఉద్యోగులకు సర్వీస్ రూల్స్ అమలు చేయనున్నట్లు డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు తెలిపారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్ర స్థాయి అభివృద్ధి కమిటీ సమావేశం చేసిన తీర్మానాల మేరకు జీఓ నంబర్ 44ను వరంగల్ డీసీసీబీ పరిధిలో అమలు చేసేందుకు వరంగల్ డీసీసీబీ తీర్మానించింది. ఈసందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ.. సహకార ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు మంచి వేతనాలు లభిస్తాయన్నారు. ఉద్యోగులు కూడా అంకితభావంతో సహకార సంఘాలు, బ్యాంకు అభివృద్ధికి పాటు పడాలన్నారు. జిల్లాస్థాయిలో పరిష్కారం కాని సమస్యల్ని రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో నాబార్డ్ డీడీఎం చంద్రశేఖర్, డీసీసీబీ సీఈఓ చిన్నారావు, జనరల్ మేనేజర్ శ్రీధర్, డీజీఎంలు కురువ నాయక్, రోహిణి, దమయంతి, ఏజీఎంలు రాజశేఖర్, నవీన్, రాధిక, హనుమకొండ, వరంగల్, జనగామ, ములుగు, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లా సహకార అధికారులు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం

దామెర: ఎలాంటి అనుమతుల్లేకుండా అక్రమంగా దాచిన పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు దామెర పోలీసులు తెలిపారు. గురువారం సాయంత్రం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈక్రమంలో ల్యాదెళ్ల శివారులో వెంకటేశ్వర స్టోన్ క్రషర్ వద్ద అక్రమంగా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు వెంకటేశ్వర క్రషర్ కంపెనీపై దాడులు జరిపారు. ఆ సమయంలో క్రషర్ సూపర్ వైజర్ రమేశ్ పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. కాగా.. అతడిని పట్టుకొని విచారించగా.. తన యజమాని సేగొండ శ్రీనివాస్ సూచన మేరకు క్రషర్ కోసం 1000 కిలోల అమోనియం నైట్రేట్, 18 బాక్సుల జిలెటిన్ స్టిక్స్(8600 స్టిక్స్), 20 బాక్సుల బూస్టర్ ఎక్స్‌క్లూజివ్(180 బూస్టర్స్), 3 కిలోల డిటోనేటర్ ఫ్యూజ్ ఎక్స్‌ప్లోజివ్స్(4500 మీటర్లు)ను లారీలో తెప్పించి రహస్య స్థలంలో దాచి ఉంచినట్లు తెలిపాడు. దీంతో పోలీసులు పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకొని క్రషర్ యజమాని సేగొండ శ్రీనివాస్, సూపర్‌వైజర్ బోదాసు రమేశ్‌తో పాటు పేలుడు పదార్థాలు దిగుమతి చేసేందుకు సహకరించిన కృష్ణారెడ్డి, గడ్డం రాజు, బొద్దిరెడ్డి జయపాల్ రెడ్డి, పల్లెపు నాగరాజు, సాధు కుమారస్వామిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరికి గాయాలు



క్షతగాత్రుడు యాకూబ్

నర్సంపేట రూరల్: నర్సంపేటలోని వల్లభ్‌నగర్‌లో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ముత్యాలమ్మ తండాకు చెందిన బానోత్ యాకూబ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. యాకూబ్ వ్యక్తిగత పని మీద నర్సంపేటకు వచ్చి వెళ్తున్నాడు. ఈక్రమంలో వల్లభ్‌నగర్‌కు చేరుకోగా.. ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటనలో ఎదురుగా బైక్‌పై వస్తున్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. యాకూబ్‌కు నర్సంపేట ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేశారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు వరంగల్ ఎంజీఎంకు రెఫర్ చేశారు.

14 నుంచి 'సహృదయ' రజతోత్సవం

విద్యారణ్యపురి: ఈనెల 14 నుంచి 18 వరకు సహృదయ సాంస్కృతిక సాహిత్య సంస్థ రజతోత్సవాలు నిర్వహిస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలో ఈసంస్థను స్థాపించినప్పట్నుంచి వివిధ సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. సంస్థ విభిన్న కార్యక్రమాల ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేక గుర్తింపు పొందింది. సంస్థ ప్రారంభించి 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆసంస్థ అధ్యక్ష కార్యదర్శులు గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు, డాక్టర్ ఎన్‌వీఎన్ చారి శుక్రవారం తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని సామ జగన్మోహన్‌రెడ్డి స్మారకభవన్‌లో నిర్వహించే ఈ వేడుకల్లో మొదటి రోజు చీఫ్ విప్ వినయ్‌భాస్కర్ రజతోత్సవ ప్రత్యేక సంచికను ఆవిష్కరించనున్నారు.

ప్రతీ రోజు సాహిత్య పండుగే..

ఈనెల 15, 16 తేదీల్లో ఒద్దిరాజు సోదరుల పురస్కారాలు, 17న సహృదయ అనుబంధ పురస్కారం, ప్రముఖుల సాహితీ ప్రసంగాలుంటాయి. వేడుకలు ప్రతీ రోజు సాయంత్రం 6.30 నుంచి పబ్లిక్ గార్డెన్స్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో 14న కాకతీయ నాటక కళా పరిషత్తు, వరంగల్ ఆకుల సదానందం నిర్వహణలో వసంత రాజీయం చారిత్రక పద్య నాటకంతో తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు ఆరంభమవుతాయని సాహిత్య సాంస్కృతిక కార్యదర్శులు కుందావఝల కృష్ణమూర్తి, వనం లక్ష్మీకాంతారావు తెలిపారు. 15న పండు క్రియేషన్స్ వారి 'పక్కింటి మొగుడు' హాస్య నాటిక, గంగోత్రి వారి 'పేగు రాసిన శాసనం 16న మయూరి ఆర్ట్స్ వరంగల్ వారి ఉన్నది ఒక్కటే జీవితం, అంజనా రాథోడ్ చిలకలూరిపేట వారి 'నాన్నా నేను వచ్చేస్తా' 17న మహతి క్రియేషన్స్ హైదరాబాదు వారి 'సత్యమేవ జయతే' సిరిమువ్వ కల్చరల్ హైదరాబాదు వారి 'దారుణం' 18న శ్రీ సాయి ఆర్ట్స్ కొలకలూరి వారి' నాన్నకు ప్రేమతో' జాబిల్లి కల్చరల్ నిజామాబాదు వారి 'అసుర వేదం' నాటికలు ప్రదర్శించనున్నారు. ప్రతి నాటికకు రూ.15 వేలు ఇవ్వనున్నారు. ఉత్తమ ప్రదర్శనకు రూ.20 వేలు, ద్వితీయ ఉత్తమ ప్రదర్శనకు రూ.15 వేలు ఇవ్వనున్నారు. నాటికల అనంతరం బహుమతి ప్రదానోత్సవానికి తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ అనిల్ కూర్మావతారం, ప్రసిద్ధ సినీ, టీవీ నటుడు కోట శంకర్‌రావు వస్తున్నట్లు, అనంతరం శివరాత్రి సందర్భంగా తాడూరి రేణుక బందం వారి నత్య ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు, ప్రముఖ విద్వాంసులు గుమ్మడి జనార్దన్‌కు రంగస్థల పురస్కారం ఇవ్వనున్నట్లు ప్రతీ రోజు సాహిత్య నాటక ప్రముఖులను సత్కరిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎనిమిది పరిషత్తు సంస్థలు, 80 మంది కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఆస్తి కోసమే తల్లి హత్య

- భార్య ప్రోద్బలంతో ఘాతుకం
- వివరాలు వెల్లడించిన డీసీపీ సీతారాం



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

జనగామ రూరల్: ఆస్తి కోసం భార్య ప్రోద్బలంతో తల్లిని హత్య చేశాడో ప్రబుద్ధుడు. జనగామ మండలం మరిగడిలో గురువారం జరిగిన హత్య వివరాల్ని శుక్రవారం డీసీపీ కార్యాలయంలో డీసీపీ సీతారాం నిందితులను మీడియా ఎదుట హాజరు పర్చారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజయ్య, రమణమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు కురాకుల కన్నప్ప, కుమార్తె లావణ్య. ఏడాదిన్నర క్రితం కొత్తగూడేనికి చెందిన సాయికుమార్‌తో కుమార్తె వివాహం జరిగింది. కూతురు, అల్లుడి మధ్య గొడవ కారణంగా లావణ్య తల్లి వద్దే ఉంటోంది. ఈక్రమంలో తన బిడ్డకు ఏదైనా ఆధారం చూపాలని రమణమ్మ ఖిలాషాపూర్ గ్రామ శివారులో ఉన్న నాలుగెకరాల భూమిని లావణ్య పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించింది. ఈవిషయం తెలుసుకున్న కన్నప్ప తల్లితో గొడవ పడ్డాడు. ఈనెల 5న తల్లి తలను గోడకు బాదడంతో గాయమైంది. ఇదే విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. కన్నప్పపై కేసు నమోదయ్యింది. దీంతో ఉరి వేసుకుంటానని బెదిరించి ఆత్మహత్యకు యత్నించాడు. ఆపై ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. అత్తవారి ఇంటి వద్దే ఉంటున్నాడు. కాగా.. గురువారం ఇంటికి వచ్చి రిజిస్ట్రేషన్ అయిన భూమిని తన పేరు మీద రాయాలని తల్లిని అడిగాడు. ఆమె నిరాకరించడంతో పథకం ప్రకారం వెంట తెచ్చుకున్న కత్తితో హత్య చేశాడు. తల్లిని చంపితేనే ఆస్తి దక్కుతుందని కన్నప్పను భార్య కళ్యాణి ప్రోత్సహించినట్లు అందుకే అతడు ఈదారుణానికి ఒడిగట్టాడని డీసీపీ సీతారాం తెలిపారు. అరెస్ట్ చేసిన వారిని కోర్టులో హాజరు పర్చనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈసమావేశంలో ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సైలు రఘుపతి, జీనత్ పాల్గొన్నారు.

క్రాస్ కంట్రీ పోటీలకు జట్ల ఎంపిక



క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికైన కేయూ జట్లతో స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరి

కేయూ క్యాంపస్: బెంగళూరులోని ప్రెసిడెన్సీ యూనివర్సిటీలో నిర్వహించనున్న క్రాస్ కంట్రీ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ పురుషుల, మహిళల జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న శుక్రవారం తెలిపారు. వీరిలో డి.రాజు (వాగ్దేవి డిగ్రీ కాలేజీ, హనుమకొండ), కె.రాజు (ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కాలేజీ, ఖమ్మం), ఎల్.విక్రమ్ (కవిత డిగ్రీ కళాశాల, ఖమ్మం), బి.విష్ణు (విశ్వ విద్యాలయ వ్యాయామ కళాశాల, ఖమ్మం), బి.వినోద్ (కేయూ వరంగల్), జె.రవి (టీటీడబ్ల్యూఆర్‌డీసీ మరిపెడ) ఉన్నారు. క్రాస్ క్రంటీ మహిళల జట్టులో ఎం.కావ్య, ఎ.కళ్యాణి (కేయూ వరంగల్), షేక్ సమ్రీన్ (ఎస్ఆర్అండ్ బీజీఎన్ఆర్ కాలేజీ, ఖమ్మం), కె.లక్ష్మి, పి.శిరీష వాగ్దేవి వ్యాయామ కళాశాల, బొల్లికుంట), టి.హనీ(సీవీ రామన్ డిగ్రీ కళాశాల మంచిర్యాల) ఉన్నారు. వీరికి ఫిజికల్ డైరెక్టర్ వరంగల్ కిట్స్ కళాశాల వ్యాయామ అధ్యాపకులు ఎం.శ్రీనివాస్‌రెడ్డి, కోచ్ కమ్ మేనేజర్‌గా వ్యవహరించనున్నట్లు స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ సవితాజ్యోత్స్న తెలిపారు.

కిరాణం నడవక.. బతుకు భారమై

- చిరు వ్యాపారి ఆత్మహత్య



మల్హర్: దుకాణం నడవక, బతుకు భారమై మల్హర్ మండలం తాడిచర్లకు చెందిన రామిని రమేశ్(38) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. రమేశ్ కొన్నేళ్లుగా తాడిచర్లలో కిరాణాషాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత ఐదేళ్లుగా షాపు సరిగ్గా నడవడం లేదు. దీంతో కుటుంబ పోషణ భారమైంది. తీవ్ర మనస్తాపం చెందిన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన బంధువులు, చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం మంథనికి తీసుకెళ్తుండగా.. మార్గమధ్యలో మృతి చెందాడు. రమేశ్‌కు భార్య, కూతురు ఉన్నారు. మృతుడి తండ్రి రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు కొయ్యూరు ఏఎస్సై కుమారస్వామి తెలిపారు.

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య



కుమారస్వామి (ఫైల్)

భీమదేవరపల్లి: మండలంలోని కొత్తపల్లికి చెందిన రైతు పెంట కుమారస్వామి(36) అప్పుల బాధతో గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారస్వామి వ్యవసాయంతో పాటు ముల్కనూరు సహకార సంఘంలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తనకున్న రెండెకరాల్లో పత్తి సాగు చేశాడు. రూ.3లక్షలు అప్పు చేసి సాగు నీటి కోసం రెండు బోర్లు వేశాడు. నీళ్లు పడలేదు. దీనికి తోడు వ్యవసాయ పెట్టుబడులకు సుమారు రూ.2లక్షలు అప్పు చేసినట్లు అతడి భార్య మౌనిక తెలిపింది. అప్పు తీర్చే మార్గం లేక జీవితంపై విరక్తి చెంది ఈనెల 9న వ్యవసాయ బావి వద్ద గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన సమీప రైతులు ప్రైవేట్ వాహనంలో ఆస్పత్రికి తరలించగా.. అతడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

ఖిలా వరంగల్: ఆర్థిక ఇబ్బందులతో వరంగల్ 39వ డివిజన్ విద్యానగర్ కాలనీకి చెందిన గోనెల నవీన్(40) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. నవీన్ రియల్ ఎస్టేట్‌తోపాటు ఓప్రైవెట్ ఇన్సూరెన్స్ కంపెనీలో సెల్స్ మేనేజర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. నవీన్ ఆర్థిక ఇబ్బందులతో మనోవేదన చెంది శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు.

ఉపాధి డబ్బులివ్వరా?

- నిలదీసిన కూలీలు

హసన్‌పర్తి: 'ఏడాదిగ ఉపాధి పనులు చేస్తున్నాం. ఇప్పటి వరకు పైసా కూడా రాలేదు' అని మడిపల్లిలో ఉపాధి పనులు పరిశీలించేందుకు వచ్చిన డీఆర్డీఓ అధికారి శ్రీనివాస్‌కుమార్‌ను కూలీలు ప్రశ్నించారు. హసన్‌పర్తి మండలం మడిపల్లిలో ఉపాధి పథకం పనుల్ని శుక్రవారం డీఆర్డీఓ అధికారి శ్రీనివాస్‌కుమార్ పరిశీలించారు. కాగా.. అన్నాసాగరం, జయగిరి గ్రామాల్లో ఆయన పర్యటించాల్సి ఉండగా.. వాయిదా వేసుకుని జిల్లా కేంద్రానికి వెళ్లారు. ఆయా గ్రామాల్లో సైతం కూలీలు నిలదీస్తారనే ఆయన వెనుదిరిగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. కాగా.. అన్నాసాగరంలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓలు పరిశీలించారు. డీఆర్డీఓ వెంట ఎంపీపీ కేతపాక సునిత, రేనుకుంట్ల సునిత, ఎంపీడీఓ రామకృష్ణ, సర్పంచ్ చిర్ర సుమలత, ఏపీఓ విజయలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్ రాంచంద్రు పాల్గొన్నారు.

స్నానానికని వెళ్లి.. శవమై తేలాడు



బాలయ్య మృతదేహం

బచ్చన్నపేట: స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మండలంలోని లింగంపల్లికి చెందిన నాగపురి బాలయ్య(75) మృతి చెందాడు. వృద్ధుడు అప్పుడప్పుడు ఇంటి సమీపంలోని వ్యవసాయ బావి వద్ద బట్టలు ఉతుక్కుని స్నానం చేసి వచ్చేవాడు. ఎప్పటి మాదిరిగానే గురువారం మధ్యాహ్నం ఇంట్లో చెప్పి వెళ్లిన బాలయ్య సాయంత్రమైనప్పటికీ ఇంటికి రాలేదు. అనుమానం వచ్చిన కుటుంబీకులు సాయంత్రం బావి వద్ద చూడగా బట్టలు చెట్లపై ఆరేసి ఉన్నాయి. బావిలో చెప్పులు, చేతికర్ర కనిపించాయి. పోలీసులకు సమాచారం అందించడంతో శుక్రవారం పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మోటార్లతో బావిలో నీటిని తోడారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టు మార్టానికి పంపించారు. కేసు నమోదు చేసుకున్నారు.

శుభకార్యానికి వెళ్తూ పరలోకాలకు..

వరంగల్(పర్వతగిరి): శుభకార్యానికి వెళ్తూ స్టేషన్‌ఘన్‌పూర్ మండలం రంగరాయగూడేనికి చెందిన మంద కొంరయ్య(55) మృతి చెందాడు. కొంరయ్య రావూరు మీదుగా దౌలత్‌నగర్ గ్రామానికి ఒక వివాహానికి హాజరయ్యేందుకు తన భార్య గౌరమ్మతో కలిసి ఎక్సెల్ టూవీలర్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో నెక్కొండ మండలం గుండ్రపల్లికి చెందిన ఎస్‌కె మదార్ పర్వతగిరి నుంచి అన్నారం షరీఫ్‌కు కందూరుకు వెళ్తున్నాడు. పర్వతగిరి మండలం కల్లెడ శివారుకు చేరుకోగానే.. రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో కొంరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై యాదగిరి తెలిపారు. కాగా మదార్ రాంగ్ రూట్‌లో వచ్చి కొంరయ్య మృతికి కారకుడయ్యాడని మృతుడి భార్య ఆరోపిస్తోంది.

ఏ గ్రామానికి చెందిందైనా అది ప్రభుత్వ భూమే..

- సమగ్ర సర్వే చేసి కలెక్టర్‌కు నివేదిక ఇస్తాం
- కాజీపేట తహసీల్దార్ కిరణ్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

హన్మకొండ అర్బన్: 'అధికారులే బోర్డు తిప్పేస్తున్నారు' శీర్షికన శుక్రవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కాజీపేట తహసీల్దార్ కిరణ్‌కుమార్ స్పందించారు. శుక్రవారం సర్వేయర్, రెవెన్యూ సిబ్బందితో కలిసి తహసీల్దార్ న్యూశాయంపేట , ఉర్సు గ్రామాల సరిహద్దులో ఉన్న స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్నవారిని డాక్యుమెంట్స్ తీసుకురావాలని చెప్పారు. వాటిని పరిశీలించి సమగ్రంగా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నారు. ప్రభుత్వ భూమిని కాపాడేందుకు తమ వంతుగా పూర్తిగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. గతంలో హనుమకొండ మండల పరిధిలో ఉన్న న్యూశాయంపేట గ్రామం ప్రస్తుతం కాజీపేట మండల పరిధిలో ఉందని, ఈ భూమి విషయంలో కొందరు కోర్టును ఆశ్రయించి తమకు 591 సర్వే నంబర్‌కు సంబంధించి హద్దులు ఏర్పాటు చేయాలన్నారని ఆయన తెలిపారు. అయితే న్యూశాయంపేటకు సంబంధించిన భూముల సర్వే నంబర్లు 583 వరకు ఆఖరు అవుతున్నాయని, అలాంటప్పుడు 591 నంబర్ ఇచ్చే పరిస్థితి లేదని వారికి సమాధానం చెప్పినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఆభూమి కాజీపేట మండలం న్యూశాయంపేట, ఖిలా వరంగల్ మండలం ఉర్సు గ్రామాల సరిహద్దులో ఉందని అందువల్ల సమగ్ర సర్వే చేస్తేనే భూమి ఏగ్రామానిదో స్పష్టమవుతుందన్నారు. ఏగ్రామానికి చెందిన భూమి అయినా అది ప్రభుత్వ భూమిగానే గుర్తిస్తామని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థి ప్రాణం తీసిన బైక్ రేస్?

- మృతుడు నిట్ విద్యార్థి.. మరొకరి పరిస్థితి విషమం
- ఆటో-బైక్ ఢీకొనడంతో ఘటన



రుత్విక్(ఫైల్)

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్ సమీపంలోని బాబాయి చెరువు మూల మలుపు వద్ద గురువారం రాత్రి అతివేగంగా వస్తున్న బైక్.. ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓ విద్యార్థి చనిపోగా, మరో విద్యార్థికి గాయాలయ్యాయి. బైక్ రేస్ పెట్టుకుని వేగంగా రావడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలుపుతున్నారు. మృతుడిది కామారెడ్డి జిల్లా లింగాపేట మండలం పోల్కంపేట. పోల్కంపేటకు చెందిన మర్రి రుత్విక్(19) తోపాటు ధర్మసోత్ సృపెన్, చిల్లా శ్రీమాన్ ప్రవర్ధన్ రెడ్డి, గోలి నాగవర్ధన్‌రెడ్డిలు వరంగల్ నిట్‌లో బీటెక్ తృతీయ సంవత్సరం(సీఎస్ఈ) చదువుతున్నారు. గురువారం రాత్రి వీరు భోజనం చేశాక రెండు బైక్‌లపై హసన్‌పర్తి మండలం సిద్ధాపురం వైపునకు బయల్దేరారు. సృపెన్ బైక్ నడుపుతుండగా, రుత్విక్ వెనుక వైపు కూర్చున్నాడు. మరో బైక్‌పై చిల్లా శ్రీమాన్ ప్రవర్ధన్‌రెడ్డి, గోలి నాగవర్ధన్‌రెడ్డి వెళ్తున్నారు. వీరు బైరాన్‌పల్లి గ్రామం శివారు వరకు వెళ్లి తిరుగు ప్రయాణమయ్యారు. వంగపహాడ్ సమీపంలోని బాబాయి చెరువు మూలమలుపు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆటో అతివేగంగా వచ్చి సృపెన్ నడుపుతున్న బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో సృపెన్‌తో పాటు వెనుక కూర్చున్న రుత్విక్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెనకాలే మరో బైక్‌పై ఉన్న స్నేహితులు వీరిని గమనించి రిలీఫ్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం తెల్లవారు జామున వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అప్పటికే రుత్విక్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ రావుల నరేందర్ తెలిపారు.

బైక్ రేస్.. విన్యాసాలు..

బైక్ రేస్ రుత్విక్ ప్రాణం తీసినట్లు స్థానికులు తెలుపుతున్నారు. రాత్రి భోజనం చేశాక నలుగురు విద్యార్థులు బైక్ రేస్ పెట్టుకుని విన్యాసాలు చేస్తూ ఔట్ రింగ్ రోడ్డు మీదుగా రెడ్డిపురం మీదుగా సిద్ధాపురం వైపునకు వెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు. అదే స్పీడ్‌లో తిరుగు ప్రయాణంలో బాబాయి చెరువు మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న ఆటో వీరిని ఢీకొన్నట్లు చెప్పారు.